క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ అశోక్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే విడుదల చేసిన ఎస్‌డీఎఫ్ పథకం ద్వారా రూ.10లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

తాడూరు: మండలంలోని అల్లాపూర్, మేడిపూర్‌లో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు తరగతిగదిలో విద్యాబోధన, వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం కరీంనగర్ జిల్లాకు చెందిన నడిపెల్లి వెంకటేశ్వరరావు, హరిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదానం కోసం రూ. లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వాసవీక్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చంద్రమౌలి, సువర్ణ, సుధాకర్, హైమావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తిరూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శేఖర్ కుటుంబానికి ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఇద్దరు పిల్లల చదువు కోసం రూ.20 వేలు సోమవారం పట్టణంలో అందజేశారు. పట్టణానికి చెందిన సాయన్న ఇంటి నిర్మాణం కోసం కడ్డీలు, సిమెంట్ అందజేశారు. ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏ పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది తలెత్తినా వారికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, వీరాస్వామి, సాయన్న, గణేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, పూల మొక్కల పంపిణీ



కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో పండ్లు, పూల మొక్కలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు పంచారు. అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వారు సూచించారు.

24న మండల సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్ రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

బీజేపీకి అవకాశం ఇవ్వండి



కోడేరు: బీజేపీ అవకాశం ఇవ్వాలని కర్ణాటక రాష్ట్ర బత్వాల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజేష్‌నాయక్ అన్నారు. సోమవారం ఎత్తంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు ఆధ్వర్యంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సుధాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. వివిధ పార్టీలకు చెందిన కొందరు బీజేపీలో చేరారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు ఈవీఎంతో ఓటు వేసే విధానంపై నిర్వాహకుడు వెంకటయ్య అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని కోరారు.



అచ్చంపేటలో..



కల్వకుర్తిలో తెలంగాణ తల్లికి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

కందనూలు: బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మర్రి జనార్దన్ రెడ్డిని ప్రకటించడంపై శ్రేణులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

కల్వకుర్తి: నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు అవకాశం కల్పించడంతో సోమవారం పట్టణంలో నాయకులు సంబరాలు చేశారు. ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. క్యాంపు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, పాలమూరు చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

కొల్లాపూర్: నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని ప్రకటించడంతో సంబరాలు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బాణాసంచాలు కాల్చారు. డీజే పాటలతో పట్టణంలో ర్యాలీగా తిరిగారు.

లింగాల: అచ్చంపేట(ఎస్సీ) నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా మూడో సారి గువ్వల బాలరాజుకు సీటు లభించడంతో శ్రేణులు మండల కేంద్రంలో సంబరాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిర్పతయ్య, శ్రీనివాసులు, రాజోజీ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు మూడోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సోమవారం పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సంబరాలు చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. సీఎం కేసీఆర్ నమ్మకాన్ని మరోసారి నిరూపిస్తామన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు సమావేశమై మట్లాడారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజును గుర్తించి మూడో సారి అభ్యర్థిగా ప్రకటించడంతో నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పెంట్లవెల్లి: కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా హర్షవర్ధన్‌రెడ్డి గెలిచి బీఆర్ఎస్ జెండా ఎగరడం కాయమని మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా కేంద్రంలో బాణాసంచా కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కొల్లాపూర్‌లో..

నాగులను పూజిస్తే అనంత సౌభాగ్యాలు



జిల్లా కేంద్రంలో సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కందనూలు: శ్రావణమాసంలో శుక్ల పంచమి నాడు నాగపంచమిగా వ్యవరిస్తూ, నాగుల పుట్ట దగ్గర ప్రత్యేక పూజలు చేయడం, నాగదేవతను ఆరాధిస్తే ప్రేమ, విజ్ఞానం, సుపుత్ర సంతానం కలుగుతుందని శనేశ్వర, నందీశ్వర ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా జ్ఞానేశ్వర వాత్సల్య మందిర్ ఆవరణలో నాగుల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నాగుల పుట్టలో పాలు పోయడం, నాగదేవత వెండి, బంగారు విగ్రహాలకు, గుడిలోని నాగదేవతామూర్తులకు నాగుల పంచమి రోజు ప్రత్యేకంగా శాస్త్రోక్తంగా పూజలు జరిపిన వారికి అనంత సౌభాగ్యాలు సిద్ధిస్తాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన పట్టణ సమీపంలో పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ విద్యార్థులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబిక ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కల్యాణోత్సవం, కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంతో పాటు పట్టణంలోని మహిళలు నాగుల పంచమి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. కన్యకా పరమేశ్వరి దేవాలయం, హనుమాన్ నగర్‌లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పూజలుచేసి నాగులకు పాలు పోశారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నాగులచవితిని భక్తులు ఘనంగా చేశారు. మహిళలు ఆలయాల వద్దకు వెళ్లి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.



తెలకపల్లిలో భ్రమరాంభికా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కల్వకుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు

తహసీల్దార్‌గా శ్రీకాంత్ బాధ్యతలు



కొల్లాపూర్: మండల తహసీల్దార్‌గా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆయన విధుల్లో చేరారు. సూర్యపేట నుంచి కొల్లాపూర్‌కు బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన శివశ్రీనివాస్ అమ్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్‌గా తహసీల్దార్‌గా కొనసాగిన డీటీ విష్ణువర్ధన్‌రావు నుంచి శ్రీకాంత్ బాధ్యతలు తీసుకున్నారు.

బోడబండతండాలో పారిశుద్ధ్య చర్యలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండతండాలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అందులో భాగంగా దోమల నివారణ మందును పెంట్లవెల్లి పీహెచ్‌సీ వైద్యులు స్ప్రే చేయించారు. వారు మాట్లాడుతు వర్షాకాలంలో దోమ కాటు వల్ల వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా కేఎల్ఐ పరివాహక తండాలలో ఈ స్ప్రేను చేస్తున్నామన్నారు. దోమ తెరలు, నిండుగా దుస్తులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రామ్మోహన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పౌరులకు మెరుగైన సేవలు అందించాలి

అచ్చంపేట రూరల్: పట్టణ పౌరులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పది రోజుల్లో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. వార్డులలో వార్డు ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిత, ఏఈ హేమలత, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత

బిజినేపల్లి: గడప గడపకు బీజేపీ ప్రచార్ కార్యక్రమంలో భాగంగా పనిచేస్తున్న తమకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని గడప గడపకూ వివరిస్తుంటే కేసీఆర్ అబద్ధాలు చెప్పి మోసం చేసిన తీరును ప్రజలు తమకు వివరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి కర్ణాటక నుంచి 45 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయా నియోజకవర్గాల బాధ్యతలు తీసుకుని ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి, నాయకులు కొండా మణెమ్మ, నాగేష్, బుడ్డన్న, రాము, జాకీర్ హుస్సేన్, యుగేందర్‌రావు, సుధాకర్‌రెడ్డి, భూషయ్య, నారాయణచారి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియాన్

కులమతాలకు అతీతంగా పెద్ద దర్గా ఉర్సు



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో పురాతనమైన పెద్దదర్గా ఉర్సు సందర్భంగా సోమవారం రాత్రి సయ్యద్‌ఖురానోద్దీన్ సయ్యద్‌షా అజీద్‌పాషా ఖాద్రి ఇంటి నుంచి గంధం బయలుదేరి మదనగోపాలస్వామి ప్రార్థనలు చేసుకుంటూ మదనగోపాలస్వామి ఆలయానికి చేరుకుంది. ఆనవాయితీగా వస్తున్న వేణుగోపాలస్వామి ఆలయం నుంచి దర్గాకు కావాల్సిన గంధాన్ని ఎంతో చక్కగా అలరించి ముస్లిం పీఠాధిపతులు, ఆలయ పూజారులు వైభవంగా పాటలు పాడుకుంటూ దర్గాకు గంధాన్ని తీసుకొచ్చారు. ఉత్సవాలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

శిథిలమైన తరగతి గదులు

● కమ్యూనిటీ హాల్‌లో తరగతుల నిర్వహణ

లింగాల: మండలంలోని పద్మన్నపల్లి ప్రాథమిక పాఠశాల తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గదుల పైకప్పు పెచ్చులూడడం, గోడలు పగుళ్లు వచ్చి చెట్లు మొలవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఉండడం మంచిది కాదని భావించి గ్రామంలోని చెంచు కాలనీలో ఉన్న చెంచు కమ్యూనిటీ భవనంలోకి పాఠశాలను మార్చి తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల నిర్మాణం కోసం రూ. 7లక్షలు మంజూరు అయినప్పటికీ నిర్మాణ పనులు చేపట్టడం లేదని సర్పంచ్ దేవి తెలిపారు. మరో దగ్గర పాఠశాలను కొనసాగించడం అంత మంచిది కాదని, నిర్మాణం పనులు చేపట్టేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పద్మన్నపల్లిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



చెంచు కమ్యూనిటీ భవనంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

అభ్యంతరాలు తెలపండి

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గ పరిధిలోని 262 పోలింగ్ స్టేషన్లపై సోమవారం ఫొటో ఎలక్ట్రోరల్ రోల్ కార్యక్రమం చేపట్టినట్లు ఆర్డీఓ శ్రీను తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే వచ్చే నెల 19లోగా సంబంధ ఎలక్ట్రోరల్, బూత్ లెవల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఓటర్లందరూ తమ ఓటును బూత్ లెవల్ అధికారి లేదా ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా సరిచూసుకోవచ్చన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని ఆర్డీఓ చెప్పారు.

వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

తెలకపల్లి: పంట పొలాల్లో మొలిచే వయ్యారిభామ నిర్మూలనపై రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని రాకొండలో వయ్యారిభామ నిర్మూలన అవగాహన వారోత్సవాలలో భాగంగా రైతులతో కలిసి వివరించారు. పొలాల్లో వయ్యారిభామ మొలవడం వల్ల సారం మొత్తం ఆ మొక్కలే తీసుకుంటాయని దీని వల్ల పంట ఎదుగుదల తక్కువగా వస్తుందని సూచించారు. వయ్యారిభామను ఎప్పటికప్పుడు నిర్మూలించుకోవాలని సూచించారు. ఎంపీటీసీ శివారెడ్డి, రావేఫ్ విద్యార్థులు అమృత, నర్మద, సుమాంజలి, శివ, శ్రావణి, నాగహర్ష, రైతులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



మన్ననూరులో వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో గృహలక్ష్మి పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పరిశీలన కొనసాగుతుంది. మండలంలోని 24 పంచాయతీలకు 1,811 మంది దరఖాస్తు చేసుకోగా 1,500 దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి కార్యదర్శుల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నామన్నారు.

మన్ననూర్: మన్ననూర్‌లోని వివిధ కాలనీల్లో కార్యదర్శి భీముడు, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ సమక్షంలో సోమవారం ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. సొంత ఇంటి స్థలం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ తదితర వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులో పొందుపరుస్తున్నట్లు తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



లింగాల: తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ జమీల్ మండల ప్రజలను సోమవారం కోరారు. బదిలీపై మండలానికి వచ్చిన ఆయన మొదటిసారిగా ప్రజావాణిలో పాల్గొన్నారు. మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏఓ నాగార్జునరెడ్డి, శంకర్‌లాల్, ఏఆర్ఐ తిర్పతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ పాల్గొన్నారు.

ప్రజావాణికి హాజరుకాని అధికారులు..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల కొరత ప్రతివారం కొనసాగుతూనే ఉంది. ఏ వారం చూసిన ప్రజావాణిలో పూర్తిస్థాయిలో అధికారులు ఉండే పరిస్థితే లేదు. దీంతో ప్రజలకు కూడా ప్రజావాణిపై నమ్మకం పోతుంది. ఇప్పటికైనా అధికారులు హాజరు కావాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



అంబేద్కర్‌చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మాట్లాడుతూ 4 నెలల క్రితం సంక్షేమ, గురుకుల హాస్టళ్లకు పెంచిన మెస్ ఛార్జీలు ఇప్పటికి అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రూ.2,500 మెస్ చార్జీలు పెంచాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న గదులను మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సయ్యద్, లక్ష్మణ్, రవి, శ్రీకాంత్, వివేక్ పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసే వారికి అండగా నిలవాలి

కల్వకుర్తిరూరల్: రైతును రాజును చేసే చర్యలు చేపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలని ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకుని ముఖం చాటేసే రాక్షసుల వైపు వెళ్లొద్దని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ బంధు చెక్కుల పంపిణీ చేపట్టారు. 9ఏళ్లలో రూ.72వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం దేశంలోనే కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ, మండలం, వెల్దండ మండలంలోని 19 మంది మైనార్టీలకు వందశాతం సబ్సిడీతో కూడిన రూ.లక్ష చెక్కులను అందజేశారు. మరోసారి ఆశీర్వదించి అవకాశం ఇస్తే సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఎన్నికల సందర్భంగా విదేశాల నుంచి వచ్చి మాయమాటలు చెప్పేవారితో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ ఇన్‌చార్జ్ రాజేశ్వరి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్‌చైర్మన్ షాహెద్, ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అచ్చంపేట రూరల్: మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. 2022వ ఆర్థిక సంవత్సరంలో పెంచిన ఏరియర్స్, ఏప్రిల్, మే నెల పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలోని మేనేజర్ అనితకు అందజేశారు. కార్యక్రమంలో రవి, సాయిలు, పాండు, శ్రీకాంత్, వెంకటయ్య, బాలమ్మ, కృష్ణమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



తెలకపల్లిలో మొలకల బుట్లు తీసుకెళ్తున్న చిన్నారులు



తెలకపల్లిలో బోనాల ఊరేగింపు

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో సోమవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో చేశారు. ప్రతి శ్రావణ మొదటి ఆదివారం కోటమైసమ్మకు ప్రత్యేక పూజలు చేస్తూ బోనాలు నిర్వహిస్తారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బోనాలను అలంకరించుకుని యాపరిల్లలు, జముకు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో గ్రామంలో మహిళలు బోనాలను ఊరేగించారు. కోటమైసమ్మ నుంచి బస్టాండ్ మీదుగా భారీ ఎత్తున బోనాలు తీసుకుని గ్రామం చివరలో ఉన్నటువంటి పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోచమ్మ తల్లి బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమ్లానాయక్, మోక్తాల వెంకటేష్, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో సోమవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో చేశారు. మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

29న బోనాల పండుగ..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 29న పోచమ్మ బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉర్సు, ఆదివారం మైసమ్మ బోనాలు, మంగళవారం పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



అచ్చంపేటలో ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్